



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

గురువారం,
జనవరి 23, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




## భార్యను ముక్కలుగా కోసి.. కుక్కర్‌లో ఉడికించి..

- ఓ భర్త దారుణం.. ఆమె ప్రవర్తనపై అనుమానంతోనే ఘోరం
- ఉడికిన ముక్కలను 3రోజులు ఎండబెట్టి.. దంచిన దుర్మార్గుడు
- ఆ పొడిని చెరువులో కలిపేశాడు..
- మీర్‌పేట్‌లో ఘోరం

హైదరాబాద్, జనవరి 22 : కట్టుకున్న భార్యను కత్తితో విచక్షణారహితంగా పొడిచి చంపి, అదే కత్తితో ఆమె మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా కోశాడా భర్త! ఆ ఖండిత భాగాలను కుక్కర్‌లో వేసి, ఉడికించి.. ఆ ముక్కలను మూడు రోజుల పాటు ఎండబెట్టి.. రోకలితో దంచాడు! ఆ పొడిని తీసుకెళ్లి ఓ చెరువులో పడేశాడు!! ఒళ్లు గగుర్పాటుకు గురిచేసేలా ఉన్న ఈ ఘోరం రాచకొండ పరి?ధిలోని హైదరాబాద్ మీర్‌పేట్‌లో వెలుగుచూసింది. భార్య ఎవరితోనో వివాహేతర సంబంధం కొనసాగిస్తుందనే అనుమానంతోనే అతడింతటి ఘోరానికి పాల్పడ్డాడు. నిందితుడు ఆర్మీలో పనిచేసి రిటైర్ అయిన 39 ఏళ్ల గురుమూర్తి! అతడి స్వస్థలం ఏపీలోని ప్రకాశం జిల్లా తూర్ప్రాన్. పోలీసు వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. గురుమూర్తి, 13 ఏళ్ల క్రితం ప్రకాశం జిల్లాకే చెందిన ఉప్పాల వెంకటరమణ-సుబ్బమ్మ దంపతుల కుమార్తె వెంకట మాధవిని పెళ్లి చేసుకున్నాడు. వారికి పాప (10), బాబు (7) ఉన్నారు. రెండేళ్ల క్రితం గుర్తుమూర్తి ఉద్యోగ విరమణ చేశాడు. కంచన్‌బాగ్‌లోని ఓ సెక్యూరిటీ సంస్థలో పనిచేస్తున్నాడు. కుటుంబం మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ శ్రీవెంకటేశ్వరనగర్ కాలనీలో ఓ అద్దె ఇంట్లో ఉంటోంది. కొన్నాళ్లుగా భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న గురుమూర్తి, తరచూ గొడవపడుతూ తీవ్రంగా వేధిస్తున్నాడు. ఈనెల 13న కూడా భార్యతో గొడవపడి.. ఆమెను కత్తితో పొడిచి చంపాడు. ఆ మృతదేహాన్ని ముక్కలుగా కోసి.. కుక్కర్‌లో ఉడకబెట్టి, ఆ అవశేషాలను మూడు రోజుల పాటు ఇంట్లోనే ఎండబెట్టి.. దంచి.. ఆ పొడిని బకెట్‌లో వేసుకొని జిల్లెలగూడ చెరువులో పడేశాడు. భార్యను హత్య చేసిన మూడు రోజుల తర్వాత 16వ తేదీన గురుమూర్తి, నగరంలోనే మరోచోట ఉంటున్న తన

(మిగతా 2వ పేజీలో)

# దావోస్‌లో రికార్డుస్థాయి పెట్టుబడులు

- 45,500 కోట్ల మేర సన్ పెట్రోకెమికల్స్ ఒప్పందం
- నాగర్ కర్నూల్, మంచిర్యాల, ములుగులో ప్రాజెక్టులు
- నగరంలో 10వేల కోట్లతో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్
- ఏర్పాటు చేసేందుకు కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ రెడీ
- 800 కోట్లతో జేఎస్‌డబ్ల్యూ యూఏఎస్ యూనిట్
- హైటెక్‌సిటీలో 3.2 లక్షల చదరపుటడుగుల్లో
- హెచ్‌సీఎల్ కొత్త క్యాంపస్.. 5 వేల ఉద్యోగాలు
- తెలంగాణ అంటేనే బిజినెస్.. పెట్టుబడులతో రండి
- పారిశ్రామికవేత్తల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్, జనవరి 22 : దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికపై తెలంగాణ కొత్త రికార్డు నమోదు చేసింది. గతంలో ఎన్నడూ లేనంతగా.. ఒకేరోజు రూ.56,300 కోట్ల పెట్టుబడులకు సంబంధించి దిగ్గజ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. వాటిలో ముఖ్యమైనది.. ఇంధన రంగంలో దేశంలోనే పేరొందిన సన్ పెట్రో కెమికల్స్ సంస్థ రాష్ట్రంలో భారీ పంప్డ్ స్టోరేజీ జలవిద్యుత్తు, సౌర విద్యుత్తు ప్రాజెక్టుల ఏర్పాటుకు చేసుకున్న రూ.45,500 కోట్ల ఒప్పందం. సన్ పెట్రో కెమికల్స్ ఎండీ దిలీప్ సాంఘ్వీతో సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు బుధవారం సమావేశమయ్యారు. అనంతరం కంపెనీ కొత్త పెట్టుబడులు ప్రకటించింది. సీఎం రేవంత్ సమక్షంలో దావోస్ సదస్సులో రాష్ట్రప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రంలోని నాగర్ కర్నూలు, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో మూడు చోట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రో పవర్ ప్రాజెక్టులను నెలకొల్పుతామని కంపెనీ ప్రకటించింది. ఈ మూడు ప్రాజెక్టుల మొత్తం ఇంధన సామర్థ్యం 3400 మెగావాట్లు. వీటికి 5440 మెగావాట్ల సామర్థ్యం ఉండే సౌర విద్యుత్తు ప్లాంట్లను అనుసంధానం చేస్తుంది. ఈ ప్రాజెక్టుల నిర్మాణ దశలోనే దాదాపు 7వేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయని కంపెనీ తెలిపింది. తెలంగాణ ఆవిర్భావం అనంతరం నుంచి ఇప్పటివరకు దావోస్ వేదికపై తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న భారీ ఒప్పందం ఇదే కావడం విశేషం. కాగా.. సుస్థిరమైన ఇంధన వృద్ధి సాధించాలన్న తెలంగాణ లక్ష్య సాధనలో ఈ ఒప్పందం మైలురాయిగా నిలుస్తుందని సీఎం రేవంత్ అన్నారు. ఈ ఒక్క ఒప్పందంతో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం.. నిరుడు దావోసలో సాధించిన రూ.40 వేల కోట్ల పెట్టుబడుల రికార్డును సమం చేసిందన్నారు. భవిష్యత్తు ఇంధన అవసరాల దృష్ట్యా క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీకి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. ఈ ఒప్పందంతో రాష్ట్ర యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు రావడంతోపాటు నాగర్‌కర్నూల్, మంచిర్యాల, ములుగు జిల్లాలు పారిశ్రామికంగా వృద్ధి చెందుతాయన్నారు. తెలంగాణలో రూ.10 కోట్ల పెట్టుబడితో కృత్రిమమేధ డేటాసెంటర్ క్లస్టర్‌ను నెలకొల్పేందుకు.. కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ లిమిటెడ్ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ)

(మిగతా 2వ పేజీలో)






# హైకోర్టుకు కొత్తగా.. నలుగురు జడ్జీలు

## సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసులకు రాష్ట్రపతి ముర్ము ఓకే

హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టుకు నలుగురు అదనపు న్యాయమూర్తులను నియమిస్తూ సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫారసులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. సిటీ సివిల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి రేణుక యార, సిటీ స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జి నర్సింగ్‌రావు నందికొండ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ తిరుమలాదేవి ఈద, హైకోర్టు రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్) మధుసూదన్‌రావు బొబ్బిలి రాముయ్య పేర్లను ఈ నెల 11న ఢిల్లీలో భేటీ అయిన సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. వీరంతా 2012లో జిల్లా జడ్జీలుగా ఎంపికైనవారు కావడం గమనార్హం. కాగా న్యాయాధికారుల కోటాలో వీరి ఎంపిక జరిగింది. తిరుమలాదేవి బాధ్యుతులు చేపట్టిన నాటి నుంచి 2026 జూన్ 1 వరకు హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా కొనసాగుతారని ఉత్తర్వుల్లో కేంద్రం పేర్కొంది.

మిగతా ముగ్గురు రెండేళ్లు అదనపు న్యాయమూర్తులుగా విధులు నిర్వహిస్తారని.. ఆ తర్వాత శాశ్వత న్యాయమూర్తులుగా బాధ్యతలు చేపడతారని స్పష్టం చేసింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ ఈ నెల 25న కొత్త న్యాయమూర్తులతో ప్రమాణం చేయించనున్నారు. హైకోర్టు మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 42 కాగా, ప్రస్తుతం 26 మంది ఉన్నారు. ఈ నలుగురితో కలిపి జడ్జిల సంఖ్య 30కి చేరింది. ఇంకా 12 ఖాళీలు ఉండగా, వీటి భర్తీ కోసం న్యాయవాదులు ఎదురుచూస్తున్నారు.



## జవహర్ జాన్‌పహాడ్ ఎత్తిపోతలకు అదనంగా రూ.100కోట్లు

- బెట్టైతండాలో మూసీనదిపై చెక్‌డ్యామ్‌కు రూ.7.5 కోట్లు
- అధికారుల సమవేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పాలకవీడు, జనవరి 22 : జవహర్ జాన్‌పహాడ్ ఎత్తిపోతల పథకానికి అదనంగా రూ.100కోట్లు, బెట్టైతండాలో ముసీ నదిపై చెక్‌డ్యాంకు రూ.7.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టులపై మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో అధికారులు, మండల మాజీ ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ173 కోట్లతో 5650 ఎకరాల పంట సాగు కోసం నిర్మించనున్న జావహర్ జాన్‌పహాడ్ లిఫ్ట్‌కు మరో రూ.100 కోట్లు కేటాయించినట్లు ప్రకటించారు. దీంతో ఈ లిఫ్ట్

(మిగతా 2వ పేజీలో)

## ఒక రైలు దిగి.. మరో రైలు కింద నలిగి..

# 12 మంది దుర్మరణం

- పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలు చక్రాల వద్ద నిప్పురవ్వలు.. అగ్నిప్రమాదం అంటూ వదంతులు
- చైన్ లాగి కిందకు దిగిన 50 మంది.. అటుగా వచ్చిన కర్ణాటక ఎక్స్‌ప్రెస్ ఢీ
- 12 మంది అక్కడికక్కడే మృతి.. ఛిద్రమైన శరీరాలు
- మరో 10 మందికి గాయాలు: ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి.. మహారాష్ట్ర జాల్గావ్‌లో ఘటన



ముంబై, జనవరి 22: మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లా పరందా రైల్వే స్టేషన్ సమీపంలో ఘోరం జరిగింది. పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న కొందరు ప్రయాణికులు బోగీకి నిప్పంటుకుందనే వదంతులతో కిందకు దూకారు. అటుగా వచ్చిన కర్ణాటక ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో 12 మంది అక్కడికక్కడే మృతిచెందగా.. 35 మంది గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో ఓ బాలుడు, ముగ్గురు మహిళలున్నారు. ఈ ఘటనపై జల్గావ్ ఎస్పీ డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయన అందజేసిన వివరాల ప్రకారం.. జల్గావ్ నుంచి బయలుదేరిన పుష్పక్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 5 గంటల సమయంలో పరందా స్టేషన్ సమీపానికి రాగానే.. జనరల్ బోగీ చక్రాల వద్ద నిప్పురవ్వలు

(మిగతా 2వ పేజీలో)



## పంచాయతీ ప్రక్షాళన

- ఒకే గొడుగు కిందకు వ్యవస్థలు
- జిల్లాల్లో ఒకే చోట కార్యాలయాలు
- సంస్కరణలకు సంఘాలు ఓకే.. ఏకగ్రీవ ఆమోదం



## ఢిల్లీలో ఆప్ ఓటమి ఖాయం: మోదీ

# దావోస్‌లో రికార్డుస్థాయి పెట్టుబడులు

కుదుర్చుకుంది. 400 మెగా వాట్ల సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ నెలకొల్పుతామని ప్రకటించింది. ఈ ప్రాజెక్ట్‌తో దాదాపు 3,600 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలో డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఈ డేటా సెంటర్ ఏర్పాటు మరో మైలురాయి గా నిలుస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఈ ఒప్పందంతో ఐటీ సేవల సామర్థ్యం పెరుగుతుంద ని, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని పేర్కొన్నారు. డేటా సెంటర్ల ఏర్పాటుతో తెలంగాణలో ఐటీ సేవల ప్రమాణాలు మరింత వృద్ధి సాధిస్తాయని కంట్రోల్ ఎస్ సీఈవో శ్రీధర్ పిన్నపురెడ్డి అన్నారు. అమెరికా కేంద్రంగా రక్షణ రంగంలో వివిధ ఉత్పత్తులు తయారుచేసే ప్రముఖ కంపెనీ జేఎసడబ్ల్యూ.. రాష్ట్రంలో రూ. 800 కోట్ల పెట్టుబడులు పెడతామని.. అధునాతన అన్‌మాన్డ్ ఏరియల్ సిస్టమ్స్ (యూఏవీ) తయారీ యూనిట్ ఏర్పాటుచేస్తామని ప్రకటించింది. అలాగే చెన్నైలో ప్రారంభమై ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన దిగ్గజ ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్.. హైదరాబాద్‌లో కొత్త టెక్ సెంటర్‌ను ప్రారంభించనుంది. హెచ్‌సీఎల్ టెక్ గ్లోబల్ సీఈవో, ఎండీ సి.విజయకుమార్‌తో సీఎం రేవంత్ చర్చల అనంతరం కంపెనీ ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ ఒప్పందంలో భాగంగా అత్యాధునిక క్లౌడ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సొల్యూషన్‌లకు సంబంధించి కొత్త సెంటర్ ఏర్పాటు చేయనుంది. హైటెక్ సిటీలో 3.2 లక్షల చదరపుటడుగుల విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటుచేస్తామని, దీంతో దాదాపు 5వేల మంది ఐటీనిపుణులకు ఉద్యోగాలు లభిస్తాయని కంపెనీ తెలిపింది. కాగా.. ప్రపంచస్థాయి వసతులతో కొత్త కేంద్రాన్ని ఏర్పాటుచేస్తామని సీఈవో విజయ్ కుమార్ తెలిపారు. తాజా నిర్ణయంతో నగరంలో హెచ్‌సీఎల్ కేంద్రాల సంఖ్య ఐదుకు పెరగనుంది.

### తెలంగాణలో డ్రైపోర్ట్

తెలంగాణలో డ్రై పోర్టును నిర్మించి వేర్‌హౌజ్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని.. రాష్ట్రానికి తీరప్రాంతం లేని లోటును పూడ్చడానికి ఈ డ్రై పో ర్టును మచిలీపట్నం పోర్టుకు రోడ్డు, రైల్వే మార్గాలతో అనుసంధానం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. దావోస‌లో ప్రపంచ ఆర్థిక వేదిక, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ, హీరో మోటార్ కార్ప్ సంయుక్తంగా బుధవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ భేటీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. "తెలంగాణ అంటేనే బిజినెస్.. భారీ వ్యాపార అవకాశాలున్న రంగాల్లో పెట్టుబడులతో రండి.. పారిశ్రామికవేత్తలకు తెలంగాణ ప్రభు త్వం రెడ్ కార్పెట్ స్వాగతం పలుకుతుంది" అని రేవంత్ పేర్కొన్నారు. ప్రపంచస్థాయి అత్యున్నత ప్రమాణాలతో హైదరాబాద్‌ను అభివృద్ధి




చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ లక్ష్యసాధనకుసహకరించాలని పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. ప్రపంచంలోనే అత్యుత్తమ మొబిలిటీ అవకాశా లు హైదరాబాద్‌లో ఉండాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. విద్యుత్తు వాహనాలపై తాము ప్రత్యేకంగా దృష్టి సారించామని.. ఆ వాహనాలపై రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలు రద్దు చేశామని వివరించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రజారవాణా వ్యవస్థలో 3 వేల విద్యుత్ బస్సులను ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు. అనంతరం నిర్వహించిన మరో సమావేశంలో.. ట్రిలియన్ మొక్కలు నాటడమే లక్ష్యంగా ఏర్పడిన 'ట్రిలియన్ ట్రీ ఉద్యమానికి సీఎం మద్దతు తెలిపారు. ఇందులో భాగస్వామిని అవుతానంటూ ప్రమాణం చేశారు. ప్రపంచంలోనే అత్యుత్తమ మొబిలిటీ అవకాశా లు హైదరాబాద్‌లో ఉండాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. విద్యుత్తు వాహనాలపై తాము ప్రత్యేకంగా దృష్టి సారించామని.. ఆ వాహనాలపై రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలు రద్దు చేశామని వివరించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రజారవాణా వ్యవస్థలో 3 వేల విద్యుత్ బస్సులను ప్రవేశపెడుతున్నట్టు చెప్పారు. అనంతరం నిర్వహించిన మరో సమావేశంలో.. ట్రిలియన్ మొక్కలు నాటడమే లక్ష్యంగా ఏర్పడిన 'ట్రిలియన్ ట్రీ ఉద్యమానికి సీఎం మద్దతు తెలిపారు. ఇందులో భాగస్వామిని అవుతానంటూ ప్రమాణం చేశారు.

# ఒక రైలు దిగి.. మరో రైలు కింద నలిగి.. 12 మంది దుర్మరణం

వచ్చి, పొగ రేగింది. దీంతో.. ఓ ప్రయాణికుడు "బోగీకి నిప్పంటుకుంది" అంటూ అరిచాడు. అది విని కంగారు పడ్డ ప్రయాణికులు చైన్ లాగారు. రైలు ఆగడంతో సుమారు 50 మంది ప్రయాణికులు రైలులోంచి కిందకు దిగారు. పుష్పక్ ఎక్స్‌ప్రెస్ సరిగ్గా ఓ భారీ కల్వర్టు వద్ద ఆగడంతో.. ఒకవైపు సేఫ్టీవాల్, లోయను తలపించే కాలువ.. మరోవైపు రెండో ట్రాక్ ఉన్నాయి. దీంతో.. ప్రయాణికులు ట్రాక్ ఉన్న వైపు దిగి.. నిప్పురవ్వలు వచ్చిన ప్రాంతాన్ని పర్యవేక్షిస్తూ.. అక్కడే నిలబడ్డారు. అంతలో మృత్యుశకటంగా కర్ణాటక ఎక్స్‌ప్రెస్ వారు నిలబడ్డ ట్రాక్ వైపు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో దూసుకువచ్చింది. ప్రయాణికులు తేరుకుని, పక్కకు తప్పుకొనేలోపే.. ట్రాక్‌పై ఉన్నవారిని ఢీకొంటూ.. వారిని కొంత దూరం ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనలో 12 మంది అక్కడికక్కడే మృతిచెందారు. మృతుల్లో పదేళ్ల వయసున్న ఓ బాలుడితోపాటు.. ముగ్గురు మహిళలున్నారు. మరో 10 మందికి గాయాలయ్యాయి. మిగతావారు జరిగిన దారుణాన్ని అర్థం చేసుకునేలోపు.. మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. పలు మృతదేహాల చేతులు, కాళ్లు తెగి.. రక్తపు ముద్దలు ట్రాక్‌పై దర్శనమిస్తూ.. బీభత్సమైన దృశ్యాలు కనిపించాయి. పోలీసులు కూడా తొలుత 11 మంది మృతిచెందారని భావించారు. అయితే.. ఆస్పత్రిలో శరీర భాగాలను మృతదేహాల వారీగా జతచేయగా.. 12 మంది చనిపోయినట్లు తేలిందని ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి వివరించారు. క్షతగాత్రులను పచోరాలోని బృందావన్ ఆస్పత్రికి తరలించారు. వారికి మెరుగైన చికిత్స అందించాలని మహారాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. సంఘటనాస్థలిని జల్గావ్ ఎంపీ స్మితావాఘ్, మాజీ ఎంపీ ఉన్మేశ్‌పాటిల్, జిల్లా కలెక్టర్ ఆయుష్ ప్రసాద్, ఐజీ దత్తాత్రేయ కరాలే సందర్శించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ..



అగ్నిప్రమాదమేమీ జరగలేదని, కేవలం వదంతులతోనే దారుణం జరిగిందన్నారు. మృతులంతా జనరల్ కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణిస్తున్నవారేనని వివరించారు. ఈ ఘటనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ఘటన సమాచారం అందగానే ఎనిమిది అంబులెన్స్‌లను పంపించాం. మంత్రి గిరీశ్ మహాజన్, ఇతర అధికారులు సంఘటనాస్థలికి చేరుకున్నారు. క్షతగాత్రులకు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో మెరుగైన చికిత్స అందిస్తున్నాం" అని ఎక్స్‌లో పోస్టు చేశారు. మహారాష్ట్ర సర్కారు తరఫున మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందిస్తామన్నారు.

## భార్యను ముక్కలుగా కోసి..
# కుక్కర్‌లో ఉడికించి..

అత్తగారైన సుబ్బమ్మకు ఫోన్ చేశాడు. మాధవి తనతో గొడవపడి ఇంట్లోంచి వెళ్లిపోయి ందని నమ్మించాడు. అదేరోజు ఆమెతో కలిసి మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగా భార్యను హత్యచేయాలనే పథకంలో భాగంగానే అతడు సంక్రాంతి సెలవుల పేరుతో ఇద్దరు పిల్లల్ని తన అత్తగారింటికి పంపించాడు. మాధవి ఆచూకీ కోసం స్థానికంగా ఉన్న సీసీ ఫుటేజీని పోలీసులు పరిశీలించారు. 16న మాధవి ఇంట్లోంచి బయటకు వెళ్లిపోయినట్లు ఏ ఫుటేజీలో కనిపించలేదు. దీంతో గురుమూర్తినే పోలీసులు అనుమానించి అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా మాధవిని తానే హత్య చేసినట్లు అతడు అంగీకరించినట్లు తెలిసింది. దీన్ని ఇంకా పోలీసులు ధ్రువీకరించడం లేదు. రేపోమాపో అతడిని మీడియా ముందుకు తీసుకువచ్చి వివరాలు వెల్లడించే అవకాశమున్నట్లు తెలిసింది.

# ఢిల్లీలో ఆప్ ఓటమి ఖాయం: మోదీ

న్యూఢిల్లీ, జనవరి 22: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి ఓటమి తప్పదని ప్రధాని మోదీ చెప్పారు. అందుకే ఆపద (ఆప్) పార్టీ నేతలు పూటకో కొత్త హామీ ఇస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఢిల్లీ బీజేపీ కార్యకర్తలతో మోదీ ఆన్‌లైన్ ద్వారా సంభాషించారు. 50శాతానికిపైగా ఓట్లు పడేలా బీజేపీ నేతలు, బూత్ కార్యకర్తలు లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని ఆయన సూచించారు. నిత్యావసరాలు, కనీస అవసరాలు అందక ఢిల్లీ ప్రజలు కష్టాలు పడుతుంటే కేజ్రీవాల్ శీశ్‌మహల్ వంటి భవనం కట్టుకున్నారని మోదీ ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఢిల్లీని అభివృద్ధి చెందిన రాజధాని నగరంగా తీర్చిదిద్దుతామని ప్రధాని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా.. ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌లపై చెరి రూ.50 కోట్ల మేర పరువు నష్టం దావా వేయబోతున్నట్లు బీజేపీ ఎంపీ పర్వేశ్ ప్రకటించారు. పంజాబీలు దేశానికి ప్రమాదకరంగా మారారని తాను అన్నట్లుగా దుష్ప్రచారం చేస్తున్నందుకే దావా వేస్తున్నట్లు తెలిపారు.

## జవహర్ జాన్‌పహాడ్ ఎత్తిపోతలకు
# అదనంగా రూ.100కోట్లు

సామర్థ్యం పెరగడంతోపాటు ఆయకట్టు మరో వేల ఎకరాలు పెరగనుందన్నారు. ఈ నీటితో జాన్‌పహాడ్ మునిమోపుల చెరువును నింపేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా బెట్టెతండాలో మూసీ నదిపై చెక్‌డ్యాంకు రూ.7.5 కోట్లు మంజూరు చేశారు. జాన్‌పహాడ్ గ్రామం నుంచి జవహర్ జాన్‌పహాడ్ లిఫ్ట్ పంపుహౌస్ వరకు మెటల్ రోడ్డు నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేశారు. ఈ పనులన్నీ వచ్చే పంటల సాగు వరకు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నిర్ణయాలపై మాజీ జడ్పీటీసీ మోతీలాల్, మాజీ ఎంపీపీ గోపాల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బారావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సప్పిడి నాగిరెడ్డి, తీగల వెంకట్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

# ఐదేళ్లలో కేజ్రీవాల్ ఒక్క రోజే అసెంబ్లీకి..

న్యూఢిల్లీ, జనవరి 22 : ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ గత ఐదేళ్లలో ఒక్క రోజు మాత్రమే అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తాజా నివేదిక వెల్లడించింది. అలాగే ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన సిసోడియా, సత్యేందర్ జైన్, గోపాల్‌రాయ్, ఇమ్రాన్ హుస్సేన్, కైలాశ్ గెహ్లాత్, శాసనసభ స్పీకర్ రామ్‌నివాస్ గోయెల్, డిప్యూటీ స్పీకర్ రాఖీ బిర్లా కూడా ఒక్క రోజు మాత్రమే ఢిల్లీ శాసనసభ సమావేశాలకు హాజరయ్యారని తెలిపింది. ఢిల్లీ శాసనసభ వెబ్‌సైటులో అందుబాటులో ఉన్న సమాచారం, ఢిల్లీ అసెంబ్లీ సెక్రటేరియేట్ నుంచి వచ్చిన ఆర్టీఐ సమాధానాల ఆధారంగా ఏడీఆర్ ఈ నివేదికను రూపొందించింది. 2020 ఫిబ్రవరిలో ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి డిసెంబరు 2024 వరకు ఢిల్లీ శాసనసభ గత ఐదేళ్లలో సగటున ఏటా 15 రోజులు సమావేశమైందని, మొత్తంగా 74 రోజుల పాటు శాసనసభ సమావేశాలు జరిగాయని పేర్కొంది. ప్రస్తుత ముఖ్యమంత్రి అతీశీ 31 రోజులు శాసనసభ సమావేశాలకు హాజరయ్యారని తెలిపింది. కాగా, ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మధ్యతరగతి మేనిఫెస్టో అంటూ ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ 7డిమాండ్లను లేవనెత్తారు. పన్ను ఉగ్రవాదానికి మధ్యతరగతి ప్రజలు బాధితులుగా మారారని ఆయన చెప్పారు. విద్య బడ్జెట్‌ను 2 నుంచి పది శాతానికి పెంచాలని, జీడీపీలో పది శాతం ఆరోగ్యరంగానికి కేటాయించాలని కేంద్రాన్ని కోరారు.

# సహించలేకే చేయి చేసుకున్నా

## వ్యవస్థలు నిస్తేజంగా మారడంతో తప్పలేదు

## పేదల భూముల్లోకి కబ్జాదారులు వస్తే చూస్తూ ఊరుకోం

## పోలీసులు, ఐఏఎసలు బానిసల్లా పని చేయవద్దు: ఈటల



తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ, ఎవరి మీదా దాడికి పాల్పడలేదని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చెప్పారు. చట్ట ప్రకారం పనిచేయాల్సిన వ్యవస్థలు నిస్తేజంగా మారడంతో ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని చూడలేకే చేయి చేసుకోవాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. రెండు, మూడు దశాబ్దాల క్రితం పేదలు కొనుక్కున్న భూములను రియల్ ఎస్టేట్ బ్రోకర్లు, కబ్జాదారులు గద్దల్లా తన్నుకుపోతున్నారని వ్యాఖ్యానించారు. పోలీసులు, ఐఏఎస్ అధికారులు బానిసల్లా పని చేయొద్దని, చట్టానికి కట్టుబడి పని చేయాలని హితవు పలికారు. పేదల ఆస్తుల్లోకి వచ్చి కబ్జాలకు పాల్పడినా, నిర్మాణాలు చేసినా బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని కొర్రెముల ఏకశిలానగరంలో 1985లో వేసిన లేఅవుట్‌లో 2076 మంది 200 గజాల చొప్పున స్థలం కొనుగోలు చేశారని చెప్పారు. ఈ భూమిని ఆక్రమించేందుకు కొంతమంది కబ్జాదారులు గూండాలను పెట్టి నిజమైన భూయజమానులపై దాడులకు పాల్పడుతున్నారని వివరించారు. సర్వే నంబరు 739, 749లో 149 ఎకరాల్లో లేఅవుట్ వేశారని, ఈ భూమిపై 2005 వరకు ఎలాంటి వివాదాలు లేవని ఈటల చెప్పారు. ఎంఏ రాజు, ఎ.వెంకటేష్, ఎ.విజయభాస్కర్ అనే ముగ్గురు వ్యక్తులు గతంలో భూమి అమ్మిన వ్యక్తి నుంచే సేల్ డీడ్ రాయించుకుని 47ఎకరాల భూమి తమదేనంటూ పేదల భూముల్లోకి వచ్చారని ఆరోపించారు. భూ అక్రమాలను నిలువరించేందుకు, పేద ప్రజల ఆస్తులను కాపాడేందుకు కమిటీ వేయాలని ఎంపీ ఈటల డిమాండ్ చేశారు. హైదరాబాద్ పరిసరాల్లో జరిగిన భూ ఆక్రమణల వివరాలతో త్వరలో సీఎంను కలిసి వినతి పత్రం అందజేస్తామన్నారు.

### ఎంపీ ఈటలపై కేసు నమోదు

పోచారం పరిధిలోని ఏకశిలానగర్ వెంచర్ వద్ద సెక్యూరిటీ విధులు నిర్వర్తిస్తున్నవారిపై దాడి చేసినందుకు ఎంపీ ఈటలతోపాటు ఆయన అనుచరులపై పోచారం ఐటీ కారిడార్ పోలీసులు కేసు నమోదు చేశారు. సెక్యూరిటీ గార్డు ఉపేందర్ ఫిర్యాదు మేరకు ఈటల రాజేందర్, ఏనుగు సుదర్శన్‌రెడ్డి, శివారెడ్డి, జుబేర్ అక్రమ్ తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు వర్మ తెలిపారు.



# గోదావరి-కృష్ణా వరదలపై అధ్యయనం

### ఐఐటీ రూర్కీ, హైదరాబాద్‌తో స్టడీ

### రాష్ట్రాల సమన్వయంతో గేట్ల ఆపరేషన్

### ఏపీ, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నిర్ణయం

హైదరాబాద్, జనవరి 22 : వరదల సమయంలో ప్రభావిత రాష్ట్రాలతో సమన్వ యం చేసుకుంటూ సత్వర చర్యలు తీసుకోవడానికి వీలుగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీ, తెలంగాణ డ్యామ్ సేఫ్టీ కమిటీలు నిర్ణయించాయి. బుధవా రం వర్చువల్‌గా ఈ సమావేశం జరిగింది. దీనికి తెలంగాణ నుంచి ఈఎన్‌సీ (జనరల్), స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్‌డీఎసవో) చైర్మన్ జి.అనిల్‌కుమార్, ఈఎన్‌సీ (ఓఅండ్‌ఎం) జి.విజయభాస్కర్‌రెడ్డి, కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) చీఫ్ ఇంజనీర్ విజయ్ ఘూగరే, సీ డబ్ల్యూసీ డైరెక్టర్ (సౌత్-హైడ్రాలజీ) నిత్యానందరాయ్, కర్ణాటక జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ మంజునాథ్, ఏపీ జలవనరుల శాఖ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ రాజేంద్రప్రసాద్, ఓయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పి.రాజశేఖర్, జేఎన్‌టీయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.శ్రీనివాసులు హాజరయ్యారు. రాష్ట్రాల మధ్య వరదలపై కచ్చితమైన సమాచార మా ర్పిడి లేక ప్రాజెక్టుల నిర్వహణ, గేట్ల ఆపరేషనల్ ప్రొటోకాల్‌లో ఇబ్బందులొస్తున్నాయని గుర్తించారు. మహారాష్ట్రలో ఆకస్మిక వరదలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకింద ఉన్న కాళేశ్వరంలోని ప్యాకేజీ-21కు చెందిన పంప్‌హౌస్ నీట మునిగిందని, విజయవాడ కూడా వరదలతో ప్రభావితమైం దని, మహారాష్ట్రలోని నాందేడ్ కూడా ఎస్‌ఆర్‌ఎస్పీలో వరదల సమయంలో గేట్లు ఎత్తకపోవడంతో ముంపునకు గురైందని గుర్తించారు. దీని కోసం గోదావరి, కృష్ణా నదుల క్యాచ్‌మెంట్ ఏరియాలో ఫ్లడ్ రూటింగ్‌పై ఐఐటీ -హైదరాబాద్, ఐఐటీ-రూర్కీతో అధ్యయనం చేయించి, ప్రాజెక్టు ల గేట్ల ఆపరేషనల్ ప్రొటోకాల్‌ను ఖరారు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా రియల్‌టైమ్ రెయిన్‌ఫాల్ డాటాను రాడార్, శాటిలైట్ ఆధారంగా పంచుకోవడం, అత్యాధునిక విధానాలతో గేట్ల ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. వాతావరణ మార్పుల సమాచారం ఆధారంగా రిజర్వాయర్ల నిర్వహణ చేపట్టాలని గుర్తించారు. కాగా, ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని పెద్దవాగు మధ్యతరహా ప్రాజెక్టు నిరుడు జూలై 18న వరదలతో కట్టతెగిన విషయం విదితమే. ఈ ప్రాజెక్టు స్పిల్ వే సామర్థ్యం పెంచాలని నిర్ణయించారు. జాతీయ ఆనకట్టల భద్రతసంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) సిఫారసుల అనంతరమే మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులు/పునరుద్ధరణ చేపట్టాల ఈ భేటీలో నిర్ణయించారు. రాష్ట్రంలో వానాకాలానికి ముందు, వానాకాలం తర్వాత ప్రాజెక్టుల స్థితిగతులపై నిర్ణీత వ్యవధిలోగా నివేదికలను సిద్ధం చేసి, ధర్మపోర్టల్ (ఎన్‌డీఎసఏ) పొందుపరచాలని నిర్దేశించారు.

# దేవరకొండ కృష్ణవేణి స్కూల్‌లో క్రీడా సంబురాలు

**విద్యార్థులు క్రీడలతో పాటు స్నేహభావం పెంపొందించుకోవాలి**

**దేవరకొండ డివిజన్ ఏఎస్పి మౌనిక ఐపీఎస్**








దేవరకొండ జనవరి 22 వార్త మిర్రర్ : దేవరకొండ కృష్ణవేణి పాఠశాలలో విద్యా సంవత్సరం లో భాగంగా ఖేరమెల్ క్రీడా కార్యక్రమాలు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవరకొండ డివిజన్ ఏ ఎస్ పి మౌనిక ఐపీఎస్ విచ్చేసి క్రీడా జ్యోతి ప్రజలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏ ఎస్ పి మౌనిక మాట్లాడుతూ విద్యార్థులకు ఆటలతో పాటు చదువు యొక్క ప్రాముఖ్యతను, ఏలా చదివితె ఉన్నత శిఖరాలకు చేరుకుంటారో తన జీవిత అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. విద్యార్థులు క్రీడలలో రాణించడం వల్ల స్నేహభావం, ఉల్లాసం, గెలవాలన్న కసి, పోరాట పటిమ అలవర్చుకోవచ్చని అన్నారు. క్రీడలలో రాణించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు.అదే విధంగా పాఠశాల డైరక్టర్ రాజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతు క్రీడలు పిల్లలలో శరీరక ఎదుగుదలను మానసిక ఉల్లాసానికి ఎంతో తొడ్పడతాయని ఆటల ప్రాముఖ్యతను గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్ గౌడ్ వైస్ ప్రిన్సిపాల్ అన్వర్ హస్సేన్, ఉపాధ్యయదం బృందం. విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మార్షల్ ఆర్ట్స్ పురస్కార్ అవార్డులు

**మార్షల్ ఆర్ట్స్ రంగంలో**

**అద్భుతమైన విజ్ఞానం సాధనలకు గౌరవం**



దేవరకొండ జనవరి 22 వార్త మిర్రర్ : 2025 జనవరి 21న హైదరాబాద్ నగరంలోని నాంపల్లిలోని బిర్లా ఆడిటోరియంలో ఒక ప్రతిష్ఠాత్మక జరిగింది, ఇందులో మార్షల్ ఆర్ట్స్ రంగంలో అద్భుతమైన విజ్ఞానం మరియు సాధనలను గౌరవించటం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించగా, శిహాన్ కేశవ్ గౌడ్ గారు మల్లయిపారు. ఇది మార్షల్ ఆర్ట్స్ కళలో ముఖ్యమైన ఘట్టం గా నిలిచింది, ఎందుకంటే ఇందులో మార్షల్ ఆర్ట్స్ పురస్కార్ అవార్డులు మల్టీ టాలెంటెడ్ పురస్కార్ అవార్డు మరియు రైజింగ్ స్టార్ పురస్కార్ అవార్డు సొంతం చేసుకున్న పలువురు ప్రతిభావంతులైన వ్యక్తులు వారి కృషిని, అంకితభావాన్ని అంగీకరించి, ఆ రంగంలో చేసిన గొప్ప కృషిని గుర్తించడమయ్యింది. ఈ వేడుకలో పలువురు సీనియర్ మార్షల్ ఆర్ట్స్ మాస్టర్లు, ముఖ్య అతిథులుగా పాల్గొని అవార్డు గ్రహీతల కృషిని, అంకితభావాన్ని ప్రశంసించారు. ముఖ్య అతిథులుగా శ్రీ. గి. సతీష్ మణోహర్ గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు, అలాగే శ్రీ. చిత్తుల మహిపాల్ రెడ్డి అతిథి గౌరవంగా ఉన్నారు. ఈ అవార్డు కార్యక్రమంలో ఆయుష్ కరాటే అకాడమీ ఆఫ్ ఇండియా నుండి ప్రతిభావంతులను గౌరవించటం జరిగింది. ఆ అకాడమీ వ్యవస్థాపకులు మరియు డైరెక్టర్రేజవత్ చైతన్యమార్షల్ ఆర్ట్స్ పురస్కార్ అవార్డు అందుకున్నారు, ఇది ఆయన భారతదేశంలో మార్షల్ ఆర్ట్స్ వ్యాప్తికి చేసిన అంకితభావం కృషిని గుర్తించటం ఇంకా పలువురు ప్రతిభావంతులు ఇతర అవార్డులతో గౌరవించబడ్డారు.మునిసీ అంజయ్యలిమల్టీ టాలెంటెడ్ పురస్కార్ అవార్డులిలి అందుకున్నారు, ఇది వివిధ రంగాల్లో ఆయన ప్రతిభను, శ్రద్ధను గుర్తించటం.మదబోయిన్దా తేజ వర్షినీ పున్న శ్రీజన్ మాకం అఖిల్ రైజింగ్ స్టార్ మార్షల్ ఆర్ట్స్ పురస్కార్ అవార్డులిలి పొందారు, వీరు వారి క్రమబద్ధమైన శిక్షణ మరియు ప్రతిభ కోసం గౌరవించబడ్డారు. ఇక, బి. ఎశ్వరప్ప కూడామార్షల్ ఆర్ట్స్ పురస్కార్ అవార్డులిలి అందుకున్నారు, ఇది ఆయన ఈ కళకు చేసిన గొప్ప కృషిని గుర్తించటం ఈ అవార్డు కార్యక్రమం శిహాన్ కేశవ్ గౌడ్ గారు, వారి సీనియర్ మార్షల్ ఆర్ట్స్ మాస్టర్లు మరియు ఉపాధ్యాయులతో జాగ్రత్తగా నిర్వహించబడింది. వారు శిహాన్ రంగు గణేష్ గౌడ్ శిహాన్ సి. అమర్సింగ్ గౌడ్ మొహమ్మద్ ఖాజుద్దిన్ సీనియర్ మాస్టర్ శిహాన్ గోపి గౌడ్ శిహాన్ గణేష్ నాయక్ , డా. డి. రాము కయోగి డా. జి. షైందర్ (సాయి యాదవ్) ఈ సాయంత్రం ఒక గొప్ప మార్షల్ ఆర్ట్స్ ఉత్సవంగా మారింది, ఇందులో మాస్టర్లు మరియు విద్యార్థులు అద్భుతంగా ఈ కళకు చేసిన కృషిని గౌరవించడం జరిగింది. అవార్డులు వ్యక్తిగత ప్రతిభను మాత్రమే కాకుండా, మార్షల్ ఆర్ట్స్ యొక్క ప్రధానమైన లక్షణాలు అయిన శాంతి, శక్తి మరియు పాత్ర అభివృద్ధిలో సహకరించగల అంగీకారాన్ని కూడా ప్రతిబింబించాయి. ఈ కార్యక్రమం పాల్గొన్న ప్రతి ఒక్కరి మనస్సులో శాశ్వతమైన ముద్రను వేసింది, మార్షల్ ఆర్ట్స్ కళలో తమ ప్రయాణాన్ని అంకితభావం మరియు సంకల్పంతో కొనసాగించాలని ప్రేరణను అందించింది. తద్వారా తదుపరి తరం మార్షల్ ఆర్ట్స్ రంగంలో తమ కృషి, సాధనలను పెంచడానికి ప్రేరణ పొందింది.

# ఘనంగా అత్తాపూర్ పల్లవి స్కూల్ వార్షికోత్సవ వేడుకలు






సికింద్రాబాద్, వార్త మిర్రర్ జనవరి 22...అత్తాపూర్ లోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ 2024-25 వార్షిక దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంగా, ఘనంగా జరుపుకుంది. 'సినీమ్యాజిక్- ఎ జర్నీ త్రూ టైమ్' అనే థీమ్ తో ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులు యుగయుగాల బాలీవుడ్ నృత్యాల మాయాజాలాన్ని తిరిగి సృష్టించిన సినిమా అనుభూతిని అందించేలా కార్యక్రమాన్ని రూపొందించారు. ప్రతి దశాబ్దంలోని ప్రముఖ చలనచిత్రాల నుంచి తీసిన స్నిప్పెట్‌లను విద్యార్థులు సులభంగా అమలు చేయడం ఈ కార్యక్రమ ముఖ్యాంశం. విద్యార్థులు వారి ద్రవ కదలికలతో, అన్ని దరువులకు నృత్యం చేస్తూ, ప్రేక్షకులను బిగ్గరగా ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన భాజపా నాయకులు తూకాల శ్రీనివాస్ రెడ్డి ల్ లోప్ హాజరయ్యారు. గౌరవ అతిథిగా ప్రముఖ విద్యావేత్త, పర్యావరణవేత్త ప్రొ.కె.పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ కోడూరు అందించిన పాఠశాల వార్షిక నివేదికలో క్రీడలు, పాఠ్యాంశాలు, పాఠ్యాంశాల పోటీలలో విద్యార్థులు సాధించిన వివిధ విజయాలు వంటివి ఉన్నాయి. సినీమ్యాజిక్ థీమ్‌కు జీవం పోయడంలో అహర్నిశలు కృషి చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందిని ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నారాయణ మూర్తితో పాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి పాఠశాల చేసిన ప్రయత్నాలను వారు అభినందించారు. ముఖ్య అతిథి ప్రేక్షకులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, పిల్లలలో సమగ్ర అభివృద్ధి ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఇది తల్లిదండ్రులు, పాఠశాల ఇద్దరి మద్దతు లేకుండా సాధ్యం కాదని, దేశ భవిష్యత్తును రూపొందించడంలో ఇద్దరూ ముఖ్యమైన పాత్ర పోషిస్తారన్నారు. అలాగే కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు జాతీయ క్రీడల్లో రాణించిన విద్యార్థులకు అవార్డుకు ప్రదానం చేశారు.





# ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై అవగాహన సదస్సు

నేరేడు గొమ్ము జనవరి 22 వార్త మిర్రర్ : నేరేడు గొమ్ము మండలం పెద్దమనిగల్ హై స్కూల్లో బాల్య వివాహాలు నిరోధించడానికి పిల్లలకు అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రాజెక్టు సిడిపిఓ చంద్రకళ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిడిపిఓ చంద్రకళ మాట్లాడుతూ బాల్యవివాహాలను రూపుమాపాలని బాల్యవివాహాల పట్ల కలిగే అనర్థాల గురించి వివరించారు . బాల్యవివాహాల వలన పిల్లల యొక్క ఆరోగ్యం పాడవుతుందని విద్య ఆగిపోతుందని వివరించారు. బాలికలు ఎంత చదివితే అంతవరకు చదివించడానికి తల్లిదండ్రులు ముందుకు రావాలని ఆమె తెలిపారు.ప్రభుత్వము ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి వరకు ఉచితంగా విద్యను అందిస్తుందని దానిని సద్వినియోగం చేయాలని తెలియపరిచారు. విద్యతోనే తలరాతలు మార్చుకునే శక్తి ఉందని తెలియజేశారు . ఎవరికైనా ఎలాంటి ఇబ్బంది ఉన్న చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 కి కాల్ చేసి చెప్పాలని తెలియపరిచారు. బాలికలందరూ ఆత్మస్థైర్యంతో ఉండాలని ధైర్య సాహసాలు కలిగి ఉండాలని తెలియపరిచారు. ఎలాంటి విషయాలు అయినా తల్లిదండ్రులతో చర్చించాలని తెలియపరిచారు.బాల్య వివాహాలు నిరోధించడంతోపాటు.. రక్తహీనత ,సెల్ఫ్ హైజిన్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించారు,, ఈ కార్యక్రమంలో పెద్దమునిగల్ సూపర్వైజర్ శోభ అంగన్వాడి టీచర్స్, మండల విద్యాధికారి రఘు పాఠశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ రవాణా చేస్తున్న 50 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత

మిర్యాలగూడ , జనవరి 22:- (వార్తమిర్రర్) : మిర్యాలగూడ పట్టణం ఈదులగూడ చౌరస్తా వద్ద బుధవారం వాహనాల తనిఖీలో 50 క్వింటాళ్ల ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం అక్రమ రవాణా చేస్తుండగా పట్టుకున్నామని ఒన్ టౌన్ ఇన్స్పెక్టర్ పి. నాగార్జున తెలిపారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్ ను విచారణ చేయగా గాంధీనగర్ కు పోతుగంటి శ్రీనివాస్, సుందర్ నగర్ కు చెందిన మచ్చ రవికి చెందినదని పేర్కొన్నడని తెలిపారు. పిడిఎస్ బియ్యం పట్టుకున్న సీఐ నాగార్జున, ఎస్ఐ సైదీరెడ్డిలను డిఎస్పీ కే. రాజశేఖర్ రాజు అభినందించారు.




## జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ను ప్రారంభించిన ఏసిపి పి. మధుసూదన్‌రెడ్డి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 22 : చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలో రాజన్న సైన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ను చౌటుప్పల్ ఏసిపి, పి మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాస్థాయి క్రీడలు నిర్వహించి గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులను క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడం అభినందనీయం అన్నారు. క్రీడలు శారీరక దారుడ్యానికి దోహదపడతాయని అన్నారు. ఈ టోర్నమెంట్ ను క్రమశిక్షణతో నిర్వహించాలని నిర్వాహకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ మన్మధ కుమార్, ఐ ఎన్ టి యు సి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బోయ రామచందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బోయ దేవేందర్, మాజీ ఉపసర్పంచ్ బోయ అంబేద్కర్, నాయకులు కడగంచి వెంకటేష్, దూడల అశోక్, జాజుల అంజయ్య, చింతల దేవరాజు, మాధగోని అంజయ్య, బోయ నరసింహ, బీర్ల యాదయ్య, వెలిజాల జగదీష్, బొడిగె ఉపేందర్, నిర్వాహకులు బోయ వెంకట్, అంతటి జగదీష్, కడగంచి అన్వేష్, బోయ సంపత్, తూర్పుంటి వంశీ, బోయ అరవింద్, బోయ రాజు, బోయ ఆనంద్, బోయ అనిల్, ఆకాష్, శశాంక్, రోడ్డ గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## సంక్షేమ పథకాలు అమలుకు నిరంతర ప్రక్రియ

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 22 : సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని ఇందుకోసం తహాశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవచ్చని చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి అన్నారు. ప్రత్యేక అధికారి మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి పథకాలకు ఎంపికైన లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించారు. గురువారం మున్సిపల్ లోని 8వ వార్డు నిర్వహించిన గ్రామసభలో చౌటుప్పల్ ఏసిపి మసుదన్ రెడ్డి, ఆర్డీవో శేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి లు పాల్గొని మాట్లాడారు. ప్రజలకు అర్థమయ్యే విధంగా సంక్షేమ పథకాల జాబితాను గ్రామసభలలో చదవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ మన్మధ కుమార్,వార్డు కౌన్సిలర్లు కొయ్యడ సైదులు,కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి,కంచర కుంట్ల రామ్ రెడ్డి,వార్డు ఆఫీసర్ బాలకృష్ణ,గోపనబోయిన మహేష్, బద్రి బాలరాజు, పాశం శ్రీను తదితర నాయకులు పాల్గొన్నారు.




**జిల్లా కలెక్టర్ ఆఫీస్ నందు జనవరి 25న**

## ఆర్ ఆర్ ఆర్ రైతుల ధర్నా

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 22 : ఆర్ఆర్ఆర్ ఐకవేదిక ఆధ్వర్యంలో భూ నిర్వాసితులు భూములు కోల్పోతున్న రైతుల ధర్నాను విజయవంతం చేయండి అని త్రిబుల్ ఆర్ ఐక్యవేదిక కన్వీనర్ చింతల దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్రిబుల్ ఆర్ భూనిర్వాసితుల ఐక్యవేదిక సమక్షంలో అన్ని అఖిలపక్ష రాజకీయ నాయకుల సహకారంతో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆఫీస్ నందు జనవరి 25న రైతుల ధర్నా నిర్వహించుచున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నాలో ఉమ్మడి నల్గొండ, మెదక్ జిల్లాల భూ నిర్వాసితులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బూరుగు కృష్ణారెడ్డి,గుజ్జుల సురేందర్ రెడ్డి,దెబ్బటి రాములు గౌడ్ జాల వెంకటేష్ యాదవ్,జాల శ్రీశైలం,ప్రకాష్ రెడ్డి మల్లేష్ దశరథ పాల్గొన్నారు.

# మైనార్టీ గురుకులాన్ని సందర్శించిన గురుకులాల డైరెక్టర్ విద్యార్థులతో ముఖాముఖి





మిర్యాలగూడ జనవరి 22:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ పట్టణంలోని మైనారిటీ ఆశ్రమ పాఠశాలలో బస చేసేందుకు రాష్ట్ర మైనారిటీ గురుకులాల డైరెక్టర్ కే. లక్ష్మీ బుధవారం సాయంత్రం చేరుకోగా స్థానిక సబ్ కలెక్టర్ ఏం. నారాయణ్ అమిత్, గురుకులాల జిల్లా కో ఆర్డినేటర్ పాండుగౌడ్, తహసీల్దార్ ఎన్.హరిబాబు, ప్రిన్సిపాల్ అరుణకుమారి స్వాగతం పలికారు. ఆమె పాఠశాల పని తీరు, వంటగది, స్టోర్ రూం, పరిసరాలను పరిశీలించారు, పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. విద్యార్థులతో వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మైనార్టీ గురుకులంలో చదివే విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత ఫలితాలు సాధించి ఉన్నత విద్యార్థులుగా ఎదగాలని కోరారు . విద్యార్థులతో కలిసి వారితో భోజనం చేశారు. విద్యార్థుల మధ్య నిద్ర చేశారు.

## ఔదార్యం చాటుకున్న పాఠశాల పూర్వ విద్యార్థి

### మినీ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సహకారం

వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి జనవరి 22 : జగిత్యాల జిల్లా రాయికల్ మండలం భూపతిపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సురక్షితమైన త్రాగు నీటి సౌకర్యంకై పూర్వ విద్యార్థి తన స్వంత ఊరిలోని పాఠశాలలో తన వంతుగా సహాయం చేయాలి భూపతిపూర్ వాసి అమెరికాలో ఉంటున్నటువంటి పునుగోటి భరత్ రావు వారి తండ్రి భాస్కర్ రావు జ్ఞాపకార్థం తాను చదువుకున్న పాఠశాలకు తన వంతుగా సహాయం చేయాలి అనే మానవతా దృక్పథంతో విధ్యార్తులకై 32000/- ముప్పై రెండు వేలతో మినీ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ఆర్థిక సహాయం చేసారు. ఈ సందర్భంగా పునుగోటీ భరత్ రావు ని ప్రధానోపాధ్యాయుడు తిరుక్కోవెల వేణుగోపాల్, ఉపాధ్యాయులు గుర్రం మారుతి, తాజా మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, ఉపసర్పంచ్ అన్నవేణి వేణు, పాఠశాల యాజమాన్య కమిటీ మాజీ చైర్మన్ జక్కుల రాజేంద్రప్రసాద్, గ్రామ ప్రజలు అభినందించారు.



# దరఖాస్తుల పేరుతో కాలం వెల్లదీస్తున్న కాంగ్రెస్ సర్కార్



### ఇది ప్రజా పాలన కాదు, ముమ్మాటికి ప్రజా వ్యతిరేక పాలన

### బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మదర్ డైరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనరసింహారెడ్డి

మోత్కూర్ వార్త మిర్రర్ ప్రతినిధి (ఏలే భాస్కర్) : రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు అర్హుల జాబితాను సిద్ధం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మదర్ డైరీ డైరెక్టర్, బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు రచ్చ లక్ష్మీనరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. భువనగిరి మండలం అనంతారం గ్రామంలో గ్రామ సభకు హాజరైన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ని ప్రజలు నిలదీసినందుకు అక్కడి నుండి వెళ్లిపోవడం చూస్తే ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం పై ఏ పాటి నమ్మకం ఉందో అర్థమవుతుంది అని, తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన పట్ల ప్రజలు ఎంత ఆగ్రహంతో ఉన్నారో ఇప్పటికైనా అర్థం చేసుకోవాలని లక్ష్మీనరసింహారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ఆడంబరంగా నిర్వహిస్తున్న గ్రామసభల సాక్షిగా మీ ప్రభుత్వం పై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత తేటతెల్లమైందని ఊరురా తిరుగుతున్న, జనం ఎక్కడికక్కడ నిలదీస్తున్న ప్రజానీకాన్ని చూస్తే కాంగ్రెస్ ఏడాదిపాలన పెద్ద ఫెయిల్యూర్ అని అర్థమవుతుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విదేశాల్లో, మంత్రులందరూ పక్క రాష్ట్రాల్లో బిజీగా ఉంటే ప్రజలను ఎవరు పట్టించుకోవాలి అని ఆయన ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో పోలీసుల పహారా నడుమ గ్రామసభలు నిర్వహించాల్సిన దుస్థితి రావడం దారుణమని అన్నారు పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ఒకవైపు గ్రామసభలు నిర్వహిస్తుంటే మరోవైపు కాంగ్రెస్ కార్యకర్తలకే పథకాలు ఇస్తామని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు చెప్పడం సిగ్గుచేటు అని విమర్శించారు. అలాంటప్పుడు గ్రామసభలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నట్లేనా?, అర్హులైన వారికి పథకాలు ఎగ్గొడుతున్నట్లేనా? అని నిలదీశారు. చివరకు గ్రామ సభలు కూడా పోలీసుల పహారాలో జరగడం చాలా బాధాకరమని రచ్చ లక్ష్మీనరసింహారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు.

# ఇంటర్నేషనల్ మల్టీ టాలెంటెడ్ పురస్కార్ అవార్డు అందుకున్న ముసిని అంజిబాబు



### వ్యాపార వేత్త గా,రియల్ ఎస్టేట్ వ్యాపారీగా జర్నలిస్ట్ గా,యూట్యూబ్ ఫోక్ యాక్టర్ గా రాణింపు

### కేశవ్ కరాటే అకాడమీ ఇంటర్నేషనల్

### ఆధ్వర్యంలో అవార్డు అందజేత

### ఇంటర్నేషనల్ అవార్డు నా బాధ్యతను పెంచింది

### అవార్డు గ్రహీత ముసిని అంజిబాబు



దేవరకొండ జనవరి 22 వార్త మిర్రర్ : నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణానికి చెందిన ముసిని అంజిబాబు మంగళవారం రోజు ఇంటర్నేషనల్ మల్టీ టాలెంటెడ్ పురస్కార్ అవార్డును అందుకున్నారు. హైదరాబాద్ బిర్లా ఆడిటోరియంలో 26 జనవరి స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ అవార్డుల కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్ కరాటే కుంగ్ ఫు వివిధ రంగాలలో ప్రత్యేక ప్రతిభను కలిగి ఉన్న అర్హులను గుర్తించి స్పెషల్ కేటగిరిలో ఇంటర్నేషనల్ అవార్డులను అందించారు. ఇందుకుగాను ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణానికి చెందిన ముసిని అంజిబాబు తనదైన శైలి లో బిజినెస్ మాన్ గా 15 సంవత్సరాల నుండి వ్యాపార రంగంలో ఎంతోమంది యువతకి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, తను స్వశక్తితో ఎదుగుతూ, ఐదు సంవత్సరాల నుండి న్యూస్ రిపోర్టర్ గా పనిచేస్తూ, రియల్ ఎస్టేట్ రంగంలో, అలాగే అతికొద్ది కాలంలోనే యూట్యూబ్ లో లవ్ సాంగ్స్, ఫోక్ సాంగ్స్ లలో హీరోగా నటించి అనతి కాలంలోనే యూట్యూబ్ స్టార్ గా నిలిచి అందరి మన్ననలు పొంది అన్ని రంగాలలో తనకంటూ ఒక ప్రత్యేకమైన ముద్ర వేసుకొని అందరితో కలిసిమెలిసి ఉంటూ జీవనం సాగిస్తున్న ముసిని అంజిబాబు జనవరి 21 మంగళవారం రోజు హైదరాబాద్ లోని బిర్లా ఆడిటోరియంలో ఇంటర్నేషనల్ మల్టీ టాలెంటెడ్ పురస్కార్ అవార్డు ను అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత ముసిని అంజిబాబు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక రంగంలో టాలెంట్ అనేది ఉంటుందని దానిని కార్యాచరణలో పెడితే ఏ రంగంలోనైనా రాణించవచ్చని ఇష్టంతో ఏ పని చేసినా సంతోషంగా ఉంటుందని కష్టపడి సాధించవచ్చునని అన్నారు. నా ఈ అవార్డు నాకు మరింత బాధ్యత పెంచిందని, నన్ను గుర్తించి నా అవార్డుకు సహకరించిన ఆయుష్ కరాటే అకాడమీ మాస్టర్ చైతన్య కు అలాగే ఇంటర్నేషనల్ అవార్డు అందించిన కేశవ్ కరాటే అకాడమీ ఫౌండర్ , కరాటే మాస్టర్ కేశవ్ గౌడ్ లకు ప్రత్యేక నమస్కారాలు, ధన్యవాదాలు తెలియజేశారు..

# ఆధ్యాత్మికం - దానమే ధర్మం



వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) జనవరి 22 : భారతీయ సంస్కృతిలో దానం ప్రముఖమైంది. అదెంతో మహిమాన్విత స్థానాన్ని సంతరించుకుంది. సనాతన ధర్మానికి ప్రధాన సూత్రమైన దానగుణం, మానవహితానికి ఏర్పరచిన పరిపక్వ ప్రణాళికగా గోచరిస్తుంది. దానం స్వీకరించేవాడికి భుక్తి ప్రదాయకం. ఇచ్చేవాడికి ముక్తి ప్రదాయకం. దానం ఇచ్చేవాడి ఆయువు పెరిగినా, తీసుకునేవాడి ఆయువు మాత్రం తరగదు. సంపన్నులు నిరుపేదలను, నిస్సహాయులను ఆదుకునేందుకు దానగుణం మానవజాతిలో సర్వదా సుస్థిరమై వెలుగొందాలనే మన పురాణాలు, శాస్త్రాలు చెబుతున్నాయి. తల్లికిచ్చిన దానం నూరు రెట్లు, తండ్రికిచ్చిన దానం వెయ్యి రెట్లు, సహోదరులకిచ్చిన దానం అనంతంగా ఫలితాన్నిస్తుందంటారు. పాపాత్ములకు, దుర్వ్యసనపరులకు ఇచ్చిన దానం పూర్తిగా వ్యర్థమైపోతుంది. అంటే, యోగ్యులకే దానం చెయ్యాలి. పాత్రతనెరిగి దానం చెయ్యాలి. తీర్థయాత్రల్లో, పుష్కర స్నాన సమయాల్లో, శుభకార్యాల్లో చేసే దానం పుణ్య ఫలితాలనిస్తుంది. మహాభారతం 'అరణ్యపర్వం'లో మార్కండేయ మహర్షి ధర్మరాజుకు దానధర్మాల మహిమ గురించి విపులీకరించాడంటారు. దానం ఇవ్వలేనివాడు, ఇవ్వగలిగే సత్పురుషుణ్ని యాచకుడికి చూపినా పుణ్యఫలమే సంప్రాప్తిస్తుందట. బీదలకు చేసేదానం దేవుడికిచ్చిన అప్పుతో సమానం. దేవుడు మళ్లీ వడ్డీతోసహా మనకందజేస్తాడు! మరికొన్ని పురాణాల్లో పదమూడు విధాల దానాల వివరణ ఉంది. రక్తదానం, ఆరోగ్యదానం, అవయవదానం, నేత్రదానం, కాయదానం, శ్రమదానం, సమయదానం, అభయదానం, ఆశీర్వచన దానం, దయాదానం, క్షమాదానం, త్యాగదానంతో పాటు గోదాన - కన్యాదాన మహిమలనూ విపులీకరించారు. దానం చేస్తున్న మనిషిలో ప్రేమ, శ్రద్ధ, అభిమానం ఉండాలి. లోభత్వం ప్రకటించకూడదు. ఔదార్యం, దాక్షిణ్యం కలిగిన దానమే సత్ఫలితాలను ఇస్తుంది. విసుగుదలతో రాగద్వేషాలతో ఇచ్చేదానం నిరర్థకం. పేదలకు మనం పెట్టే ఆహారం దేవుడి ఖాతాలో మన పేర జమవుతుందని గ్రహించాలంటారు పెద్దలు. జ్ఞాని అయిన ధనికుడు తన సంపాదనలోని కొంత భాగాన్నయినా దానం చెయ్యాలన్న నియమం పెట్టుకుంటాడు. ధనికుడైన లోభి కన్న దానశీలి అయిన పేదవాడు గొప్పవాడు. సముద్రంలో ఉన్న అపారమైన క్షారజలంతో దాహార్తి తీరదు. కానీ, చెలమలోని గుక్కెడు నీరు అతడి దాహం తీర్చి ప్రాణం నిలబెట్టగలదు. నీరు మంటను ఆర్పేసినట్టు దాన ధర్మాలు పాపాలకు ప్రాయశ్చిత్తం కలిగిస్తాయి. వందమందిలో శూరుడొకడే ఉంటాడు. వేయిమందిలో పండితుడొక్కడే ఉంటాడు. పదివేల మందిలో వక్త ఒక్కడే ఉంటాడు. లక్షమందిలో నిజమైన దాత ఒక్కడే ఉండొచ్చు. ఉండకపోనూ వచ్చు. దాన గుణ వైశిష్ట్యం అంత మహత్తరమైంది. క్షేత్రమెరిగి విత్తనం వేస్తే మంచి మొక్క వస్తుంది. మహావృక్షమవుతుంది. అలాగే అర్హతగలవాడికి దానం చెయ్యడంవల్లనే అనంతపుణ్యఫలం ప్రాప్తిస్తుంది. ఆర్భాటంతో, ప్రచారంతో, కీర్తికండూతితో చేసే దానం ఫలితమివ్వదు. గుప్తదానానికుండే ఫలితం అనంతమైనది. నిర్మల హృదయంతో నిస్వార్థ బుద్ధితో చేసే ఇటువంటి దానం మానవుణ్ని మహోన్నత యశోశిఖరాలకు తీసుకుపోతుంది. దానం చెయ్యడానికెంత సంపద ఉందన్నది ప్రశ్న కాదు. ఆపదలో ఆదుకునే ఆవగింజంత దానమైనా చాలు, మానవ జన్మకు సార్థకత చేకూరుస్తుంది. దరిద్రుడైనా తనకున్నదాంట్లో కొంత దానంచేసి నిస్సహాయులకు తోడ్పడవచ్చు. దానానికి ఉపయోగపడని ఎంత ధనరాశి అయినా వృథా. ఎవడికేది అవసరమో గ్రహించి ప్రదానం చేసేదే దానం. రక్త, నేత్ర, మూత్రపిండ దనాలు విశిష్టమైనవని ఆయుర్వేదంలోని అష్టాంగ మార్గం ప్రవచిస్తోంది. దీనులకు, ఆర్తులకు చేసే ఏ దానమైనా విశిష్టమైనదేనన్నారు ఆదిశంకరులు. మనంచేసే దానధర్మాలే మనకోసం ఏర్పరచుకునే సంక్షేమ నిధులు. దానం చెయ్యడం అంటే మనకోసం భగవంతుడే వెదికేలా చేసుకోవడమన్నమాట. సంపద ఉంటే దానం చెయ్యాలి. లేకుంటే హృదయాన్నయినా దానం చెయ్యాలి. అప్పుడే మానవ జన్మ చరితార్థం.

**- తిరుమల శంకర్**




## విజ్ఞాన సదస్సును విజయవంతం చేయండి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 22 : మున్సిపల్ కేంద్రంలోని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మండల సమావేశాన్ని అధ్యక్షురాలు వెన్ రెడ్డి సంధ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాంధారి ప్రభాకర్ హాజరై మాట్లాడుతూ.. జనవరి 25న చౌటుప్పల్ మండల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గాంధీ పార్క్ నందు గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు నిర్వహించుచున్నట్లు తెలిపారు.ఈ సదస్సులో ఒక ఫీట్ ఎత్తుగల గాంధీజీ, 500 విగ్రహాల ఏర్పాటు,100 చెరకల ప్రదర్శన, 500 మందితో బాల గాంధీల వేషధారణలు,గాంధీ విజ్ఞానానికి సంబంధించిన ప్రదర్శనలు,వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు,గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్ రెడ్డి విచ్చేయుచున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కే వి బి కృష్ణారావు,ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్ రెడ్డి,మండల కార్యదర్శి డాక్టర్ ఉజ్జిని మంజుల,కోశాధికారి పోలోజు శ్రీలత, ఉపాధ్యక్షులు బొబ్బిలి సంధ్య, మమత,భవాని లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.




## రాయికల్ మున్సిపల్ ప్రజాపాలన వార్డు సభలు విజయవంతం

వార్త మిర్రర్ జగిత్యాల నియోజకవర్గం ప్రతినిధి జనవరి 22 : తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన వార్డు సభలలో భాగంగా బుధవారం రోజున జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణములోని 3 వార్డులు (వార్డు 4,5,6) లలో వార్డు సభలు నిర్వహించనైనది. ఇట్టి వార్డు సభలకు ప్రజలు అధికశాతంలో పాల్గొన్నారు మరియు ఈ రోజు జరిగిన వార్డు సభలలో రేషన్ కార్డులకు 88 మరియు ఇందిరమ్మ ఇండ్లకు 80 దరఖాస్తులు వచ్చిన్నవి. ఇట్టి వార్డు సభలకు ముఖ్య అతిదులుగా గౌరవ చైర్ పర్సన్ మోర హన్మండ్లు, స్పెషల్ ఆఫీసర్ డియిఓ. రాము, వైస్ చైర్ పర్సన్ శ్రీమతి గండ్ర రమాదేవి, తహసీల్దార్ ఖయ్యుమ్, కమిషనర్ ఎ. జగదీశ్వర్ గౌడ్, వార్డు కౌన్సిలర్స్ శ్రీ టి.శ్రీధర్, వి. మహేష్ గౌడ్, అన్వారి బేగం, క్లస్టర్ ఆఫీసర్ శ్రీ బి. వెంకటి, రెవెన్యూ ఆర్. ఐ, వార్డు అధికారులు, ఆర్.పి లు, ప్రజలు, నాయకులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దేవరకొండ ఖిల్లా పార్క్ సందర్శన

### బిఆర్ఎస్ ప్రభుత్వంలో 5 కోట్ల రూపాయలతో పార్క్ అభివృద్ధి





దేవరకొండ జనవరి 22 వార్త మిర్రర్ :: దేవరకొండ లోని చారిత్రాత్మకమైన చరిత్ర కలిగిన ఖీలా ప్రాంతాలోని పార్కును సందర్శించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గాజుల ఆంజనేయులు మాట్లాడుతూ దేవరకొండ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే దృధ సంకల్పంతోటి నాటి ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ప్రత్యేక దృష్టి సారించి దేవరకొండలో పార్క్ ఏర్పాటు కోసం ఆనాటి జిల్లా మంత్రివర్యులు జగదీశ్వర్ రెడ్డి సహకారంతోటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ చొరువతో ఐదు కోట్ల రూపాయలతో పార్కును 2021వ సంవత్సరంలో నిధుల కేటాయింపు చేయించి పనులు చేయించడం జరిగింది కానీ నేడు కాంగ్రెస్ పార్టీ నాయకులు మా ఆధ్వర్యంలోనే ఖిలా పార్కును అభివృద్ధి చేసినమని అసత్యాలు పలకడం తగ్గదని అని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు రామావత్ రమేష్ నాయక్ మాట్లాడుతూ దేవరకొండ వెనుకబడిన ప్రాంతము దేవరకొండ ఖిల్లా దుర్గానికి ఎంతో ప్రాచిన చరిత్రాత్మకమైన ప్రాంతము ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని సౌద్దేశంతోటి నాటి ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ఎంతో కృషి పట్టుదలతో నాటి మంత్రులు జగదీశ్వర్ రెడ్డి సహకారంతో మున్సిపల్ శాఖ మంత్రివర్యులు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో కచ్చితంగా దేవరకొండ ప్రాంతాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని వెంటనే ఐదు కోట్ల రూపాయలు పార్క్ కోసం కేటాయించి పార్కును నిర్మిస్తే 95% పనులు పూర్తి చేసుకున్న పార్కు ఎలక్షన్ కోడ్ రావడంతో ఆనాడు ప్రారంభించుకోలేక పోయాం అనంతరం జరిగిన పరిమాణాలతో ప్రభుత్వ మారిపోవడంతోటి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఈ పార్కు మేమే సాంక్షన్ చేసిన మేమే అభివృద్ధి చేసినంమని అబద్దపు మాటలతో అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆనాడు రవీంద్ర కుమార్ గారి చేరువతోటి వారి కృషి తోటి పార్కు అభివృద్ధి జరిగిందని దురదృష్టవశాత్తు ప్రభుత్వం మారడం తోటి ఇవాళ మేమే చేసినామని అనడం మీ ప్రభుత్వానికి తగదని ఈ ప్రభుత్వం తీరు ఎట్లా ఉందని అంటే బర్రె ఎక్కడ కడితేనేమి మా దొడ్లో ఇంతే చాలు అన్న చందంగా వీరి పరిస్థితి ఏర్పడదని ప్రజా ప్రభుత్వమంటూ ప్రజలపైనే భారం మోపుతూ ప్రజల్ని అష్ట కష్టాలు పెడుతున్నటువంటి ప్రభుత్వం వీళ్ళదని వెంటనే వారి తప్పుడు తెలుసుకొని ఇలాంటి తప్పుడు ప్రచారాన్ని చేయకుండా ఉండాలని ఆనాడు రవీంద్ర కుమార్ ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు శంకుస్థాపన చేసినటువంటి శిలా పథకాన్ని పలగొట్టి వారే చేసినట్టు పెట్టుకోవడం ఎంతో సిగ్గుచేటు అని వెంటనే శంకుస్థాపన చేసిన శిలా పథకాన్ని ఎక్కడ పెట్టాలని లేనియెడల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారుఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సత్యనారాయణ, లోహిత్ రెడ్డి ఖాదర్ బాబా, చిత్రం యేశోభ్, జానీ బాబా, చంద్రమౌళి, పోట్ల మురళి, బాబా, పోట్ల మధు, హసన్ బాబా, మహమ్మద్ నజీర్, అఫ్రోజ్, లక్ష్మణ్, జమీర్ తరి గోవర్ధన్, శ్రీను, జగ్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు..

# అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలి

### గ్రామ సభలు పారదర్శకంగా నిర్వహించాలి

### ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న విధంగా అర్హులను గుర్తించాలి

### సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,మాజీ ఎంపీపీ పల్లా నర్సింహా రెడ్డి



దేవరకొండ జనవరి 22 వార్త మిర్రర్ : కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు నిర్వహిస్తున్న గ్రామ సభలను పారదర్శకంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,మాజీ ఎంపీపీ పల్లా నర్సింహా రెడ్డి అన్నారు.బుధవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ... అధికారంలోకి రాగానే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో గ్రామాల్లో ప్రజల నుండి ఇందిరమ్మ ఇండ్లు,పెన్షన్ లు,వ్యవసాయ కూలీలకు 12000/-రైతు భరోసా, రేషన్ కార్డులు అందించడం కోసం దరఖాస్తులు తీసుకుందని వాటి ఆధారంగానే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు అర్హులను గుర్తించాలని అన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభల్లో అర్హులకు కాకుండా లబ్ధిదారుల ఎంపిక లిస్టులో అనర్హులు,ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నట్లు అన్ని గ్రామాల్లో ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్న నేపథ్యంలో నిజమైన లబ్దిదారులను ఎంపిక చేసి పారదర్శకంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని అధికారులకు సూచించారు.గ్రామాల్లో కొంతమంది అనర్హులకు అర్హుల జాబితాలో పేర్లు రావడం మూలంగానే గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభల్లో ఘర్షణలు జరగడానికి కారణమవుతున్నాయని ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేసిన విధంగా పార్టీలకతీతంగా పారదర్శకంగా పథకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.గ్రామాల్లో ఇండ్లు లేనివారికి,రేషన్ కార్డు లేనివారికి, భూమి లేనివారికి పేద బడుగు బలహీన వర్గాలకు మెదటి ప్రాధాన్యతగా అందించాలని కోరారు.అర్హులైన ప్రతి ఒక్కరికి అవకాశం కల్పించి గ్రామ సభలో పారదర్శకంగా ఎంపిక చేయాలనీ గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలనీ ప్రభుత్వం,అధికారులను నర్సింహా రెడ్డి కోరారు.

# కబ్జాకోర్లను బొంద పెట్టాల్సిందే...

### పేద ప్రజల పక్షాన పెద్దన్న పాత్ర పోషించిన ఈటలను స్వాగతిస్తున్నాం

### పాలకూరి రవి గౌడ్.. బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి



నల్గొండ జిల్లా వార్త మిర్రర్ ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత పాలనలో రౌడీముకల, భూకబ్జా కోరుల చేతిలో ఇబ్బందులకు గురవుతున్న పేద ప్రజల పక్షాన అండగా నిలబడి కబ్జా కోరులను తరిమి కొట్టిన మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ కు అభినందనలు తెలియజేస్తూ బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పాలకూరి రవి గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఏడాది గడిచినప్పటికీ నేటికీ హోం శాఖ మంత్రిని నియమించుకోకపోవడం సిగ్గు చేటని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం లో శాంతిభద్రతలు పూర్తిగా గాడి తప్పడంతో గుండాలు, రౌడీలు, కబ్జాకోర్లు రాజ్యమేలు తున్నారని, అదేవిధంగా పేద ప్రజల భూములను దౌర్జన్యంగా లాక్కొని దాడులు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ప్రభుత్వం పై రవి మండిపడ్డారు. మల్కాజ్గిరి పార్లమెంట్ పరిధిలో పేద ప్రజల యొక్క భూములను లాక్కుంటున్న విషయాన్ని అక్కడి ప్రజలు ఆ నియోజకవర్గ పార్లమెంటు సభ్యులు అయిన ఈటల రాజేందర్ దృష్టికి తీసుకురావడంతో వారు వెంటనే స్పందించి అక్కడికి వెళ్లి అక్కడి పరిస్థితులను గమనించి అక్కడ ఉన్న, రౌడీమూకలను తరిమి కొట్టడం జరిగిందని తెలిపారు. అక్కడి ప్రజలు శుభ సూచీకంగా భావిస్తున్నారని ప్రభుత్వం చేయలేనటువంటి పనిని ప్రజలు తనకు ఓటు వేసి గెలిపించుకున్నందుకు ఈటెల రాజేందర్ ఇలా చేయడాన్ని స్వాగతిస్తున్నాం అని రవి గౌడ్ తెలిపారు.



# యుబిఎస్ కంపెనీలో ఉద్యోగాలు సాధించిన టాస్క్ విద్యార్థులు

### శ్రీకాంత్ సిన్హా మరియు టాస్క్- సి.ఓ.ఓ

### సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చేతుల మీదుగానియామక పత్రాలు

కల్వకుర్తి జనవరి 22 వార్త మిర్రర్ ప్రతినిధి:- టాస్క్ తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో రెండు నెలల పాటు దాదాపు 300 మంది ఈడబ్ల్యూఎస్ కేటగిరి విద్యార్థులకు టెక్నికల్ మరియు సాఫ్ట్ స్కిల్ విభాగాలలో శిక్షణ తరగతులు నిర్వహణ తర్వాత ప్రముఖ యుబిఎస్ కంపెనీ వారు నిర్వహించిన ఇంటర్వ్యు ప్రక్రియ ద్వారా నైపుణ్యం కల్గిన 63 మంది విద్యార్థులు ఆరు లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగ అవకాశం 300 మంది ఈడబ్ల్యూఎస్ కేటగిరి విద్యార్థులకు నిర్వహించిన ఇంటర్వ్యూ ప్రక్రియలో ఎంపికైన 63 మంది విద్యార్థులకు ఈ రోజు కార్యాలయంలో టాస్క్ - సి.ఇ.ఓ శ్రీ శ్రీకాంత్ సిన్హా గారు మరియు టాస్క్ - సి . ఓ.ఓ శ్రీ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గారి చేతుల మీదుగా నియామక పత్రాల అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టాస్క్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి

కల్వకుర్తి ఊర్కొండ జనవరి 22 వార్త మిర్రర్ ప్రతినిధి:-ఊర్కొండ మండలం జగబోయిన్ పల్లి గ్రామంలో అనారోగ్యంతో అకస్మాత్తుగా కేశ యాదయ్య చనిపోవడం జరిగింది.ఈ విషయాన్ని స్థానిక బిజెపి నాయకుల ద్వారా తెలుసుకున్న రాష్ట్ర బిజెపి నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారి ఆత్మ శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయంగా రూ. 5000 రూపాయలు అందించడం జరిగింది. భవిష్యత్తులో మృతుడి కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటానని భరోసానిచారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,గ్రామస్తులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు

# గిడుగు వెంకట రామమూర్తి ఆశయసాధనకు కృషి చేయాలి



వార్తా మిర్రర్ మోత్కూరు జనవరి 22 : తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలో తీసుకవచ్చిన సంఘ-సంస్కర్త తెలుగు భాషోద్యమహుడు గిడుగు వెంకట రామమూర్తి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం నాడు వెంకట రామమూర్తి 85వ, వర్ధంతి సందర్భంగా బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక శ్రీకాంత్ చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలుగుబాషను అచ్చ తెలుగు చిచ్చర పిడుగు వెంకట రామమూర్త అనేకమంది తీసుకవచ్చిన గొప్పవ్యక్తి వెంకట రామమూర్తి అని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నోముల రమేష్ నేత స్థానిక నాయకులు, బందారు వీరస్వామి, ఇటికాల నర్సయ్య, అల్లే యాదయ్య, కళ్లెం పరమేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



### అయోధ్య లోని శ్రీ బాల రామచంద్ర మూర్తి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి రంగారెడ్డి జిల్లా బారాసోసియేషన్ న్యాయవాద బృందం

ఎల్బీనగర్,23 జనవరి: అయెధ్యాలో బాల శ్రీరామా చంద్రముర్తి ప్రాణ ప్రతిష్టాపన రోజు పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాద సభ్యులు శ్రీరాములవారి చిత్ర పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజ కర్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు పిటం ప్రదీప్, రంగా ప్రవీణ్ కుమార్ గుప్తా , పరమేష్, రాజ్ కుమార్ ఇతరులు పాల్లోన్నారు.




### ప్రజా పాలనలో దరఖాస్తులు స్వీకరణ

అమంగల్ ప్రతినిధి శివ జనవరి 22 వార్త మిర్రర్ : ఆఫీసర్ సురేందర్ సూదిని కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని ఇందిరమ్మ కమిటీ మెంబర్స్ కొండల్ రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో సూదిని కొండల్ రెడ్డి ఖాదర్ జంగయ్య తదితరులు పాల్గొన్నారు



# రోడ్డు ప్రమాదంలో చనిపోయిన కుటుంబానికి మల్లెపల్లి జగన్ ఆర్థిక చేయూత

కల్వకుర్తి జనవరి 22 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి మండలం తోటపల్లి గ్రామానికి చెందిన జోగు బంగారయ్య, జోగు మహేష్,జోగు నాగమ్మ, జోగు శ్రీపతి,జనవరి 15/01/2025 సంక్రాంతి పండుగ రోజున ప్రమాదవశాత్తు కల్వకుర్తి నుండి ఆటోలో తోటపల్లికి వెళ్తుండగా తుర్కలపల్లి గేటు దగ్గర,ముందు నుంచి వచ్చే కారు ఆటో ఢీ కొనడం జరిగింది.ఆటోలో ప్రయాణిస్తున్న జోగు బంగారయ్య, జోగు మహేష్, జోగు నాగమ్మ,మృతి చెందడం జరిగింది.ప్రమాదంలో గాయపడ్డ శ్రీపతి హైదరాబాదులో చికిత్స పొందుతున్నాడు.విషయం తెలుసుకున్న నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు ప్రముఖ న్యాయవాది మల్లెపల్లి జగన్ బుధవారం ప్రమాదంలో చనిపోయిన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు అనంతరం తన వంతు సహయంగా ఒక్కొక్క కుటుంబానికి 50 కేజీల బియ్యం ఇవ్వడం జరిగింది. అలాగే చికిత్స పొందుతున్న జోగు శ్రీపతి కుటుంబానికి తన వంతు సహాయం అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆయన వెంట అడ్వకేట్ ఎముకల జంగయ్య, కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు తోటపల్లి అనిల్ కుమార్,గుండూరు చంద్రయ్య, ప్రవీణ్ కుమార్,జోగు బందికయ్య,మృతుల కుటుంబ,సభ్యులు తదితరులు పాల్గొన్నారు..




### వినియోగదారులకు ఎయిర్‌టెల్ షాక్.. ఆ ప్లాన్లపై డాటా ఎత్తివేత

న్యూఢిల్లీ, జనవరి 22: టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ నూతన మార్గదర్శకాల ప్రకారం ప్రముఖ టెలికం సంస్థ ఎయిర్‌టెల్ రెండు ప్రీపెయిడ్ ప్లాన్లలో మార్పులు చేసింది. రూ.509, రూ.1,999 ప్రీపెయిడ్ ప్లాన్లలో డాటా ఆఫర్‌ను ఎత్తివేసింది. ప్రస్తుతం అత్యధిక ప్రీపెయిడ్ ప్లాన్లు డాటాతోపాటు వాయిస్, ఎస్ఎంఎస్ కలుపుకొని ఆఫర్ చేస్తున్నాయి. టెలికం సంస్థలు ప్రత్యేకంగా వాయిస్ లేదా ఎస్ఎంఎస్ సర్వీసులు అందించే ప్లాన్లను ప్రవేశపెట్టాలని ట్రాయ్ సూచించిన విషయం తెలిసిందే. దీంతో ఎయిర్‌టెల్ కొత్తగా రెండు ప్లాన్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటిలో 84 రోజుల కాలపరిమితితో రూ.509 ప్రీపెయిడ్ ప్లాన్‌లో అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, 900 ఎస్ఎంఎస్‌లు అందిస్తున్నది. అలాగే రూ.1,999 ప్రీపెయిడ్ ప్లాన్ కింద 3 వేల ఎస్ఎంఎస్‌లు, అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్ అందిస్తున్న ఈ ప్లాన్ కాలపరిమితి ఏడాది.

# మున్సిపల్ పార్కులో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన విగ్రహం ఏడు రోజులలో తొలగించాలి

మిర్యాలగూడ జనవరి 22:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ మున్సిపల్ పరిధిలోనీ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని మునిసిపల్ పార్కులో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగించాలని కోరుతూ బుధవారం మధ్యాహ్నం విగ్రహ దిమ్మెకు మునిసిపల్ అధికారులు నోటీసు అంటించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని స్థలంలో 2022లో పరిషత్ పాలకవర్గం, అధికారుల అనుమతి లేకుండా పార్కును నిర్మించి 23మార్చి 2023న అప్పటి రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి జీ.జగదీశ్రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు, మునిసిపల్ ఛైర్మన్ తిరునగరు భార్గవ్ ప్రారంభించారు. పార్కుకు మాజీ సర్పంచ్, మార్కెట్ మాజీ ఛైర్మన్, స్వాతంత్ర సమర యోధుడు తిరునగరు గంగాధర్ పేరు పెట్టారు. అయితే పార్కులో రెండు మూడు రోజుల క్రితం దిమ్మె నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్టించారు. పార్కులో అనుమతి లేకుండా విగ్రహం ఏర్పాటు చేశారని ఫిర్యాదుతో విగ్రహాన్ని జీఓ నంబర్ 18 తేదీ 28-2-2013 ప్రకారం తొలగించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. దీంతో మునిసిపల్ కమిషనర్ ఎండీ.యూసుఫ్, టీపిఓ వి. సోమయ్య, మునిసిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకన్న, టిపిఎస్ అంజయ్యలు ముసుగులో ఉన్న విగ్రహాన్ని పరిశీలించారు. పరిశీలన చేస్తున్న విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ కమిషనర్ కు ఫోన్ చేసి మున్సిపల్ పాలకవర్గం ఆమోదంతో ఏర్పాటు చేశామని తెలిపారనీ కమిషనర్ అన్నారు. పాలకవర్గం తీర్మానం చెల్లదని, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉన్న ఆర్ అండ్ బి, మున్సిపల్, పంచాయతీ రాజ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కూడిన కమిటీ అనుమతి ఉండాలని, అది లేనందున అక్రమం అవుతుందని సమాధానమిచ్చినట్లు కమిషనర్ తెలిపారు. విగ్రహం పెట్టిన వారే తొలగించకుంటే తాము తొలగించక తప్పదని కమిషనర్ పేర్కొన్నారు.







## టాస్క్ సిఇ ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ తరగతులు

ఆమనగల్ ప్రతినిధి శివ జనవరి 22 వార్త మిర్రర్ : ప్రముఖ - యు బి ఎస్ - కంపెనీలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు టాస్క్- సి.ఇ.ఓ. శ్రీకాంత్ సిన్హా గారు మరియు టాస్క్. సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాల అందజేత. టాస్క్ (తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్)ఆధ్వర్యంలో రెండు నెలల పాటు దాదాపు 300 మంది ఈ డబ్ల్యూ ఎస్ కేటగిరి విద్యార్థులకు టెక్నికల్ మరియు సాఫ్ట్ స్కిల్ విభాగాలలో శిక్షణ తరగతులు నిర్వహణ తర్వాత... ప్రముఖ యు బి ఎస్ కంపెనీ వారు నిర్వహించిన ఇంటర్వ్యూ ప్రక్రియ ద్వారా నైపుణ్యం కల్గిన 63 మంది విద్యార్థులు ఆరు లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగ అవకాశం. 300 మంది ఈ డబ్ల్యూ ఎస్ కేటగిరి విద్యార్థులకు నిర్వహించిన ఇంటర్వ్యూ ప్రక్రియలో. ఎంపికైన 63 మంది విద్యార్థులకు ఈరోజు టి ఏ ఎస్ కె కార్యాలయంలో టాస్క్ - సి.ఇ.ఓ శ్రీ శ్రీకాంత్ సిన్హా గారు మరియు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాల అందజేయడం జరిగింది... ఈ కార్యక్రమంలో... టాస్క్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో గిరిప్రదక్షిణలో పాల్గొన్న డాక్టర్ ర్యాకల శ్రీనివాస్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : తెలంగాణ రాష్ట్ర ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని స్వాతి నక్షత్రం సందర్భంగా భారత జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గారితో కలిసి గిరి ప్రదక్షణలో పాల్గొన్న బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, స్వాతి నక్షత్రం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్వామివారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, యాదా ఋషి వద్ద నమస్కరించి, అనంతరం గిరిప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొన్నారు



## తపస్ క్యాలెండర్లు ఆవిష్కరించిన ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తంరెడ్డి

మిర్యాలగూడ , జనవరి 22:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ తపస్ డివిజన్ సమావేశంలో తపస్ వాల్ క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్లను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తంరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఎమ్మెల్సీగా గెలిపించడం కోసం తపస్ కార్యకర్తలందరూ చిత్తశుద్ధితో పనిచేయాలని అదేవిధంగా ఉపాధ్యాయుల సమస్యల తక్షణ పరిష్కారం కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలియజేసారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు పెంటయ్య, పాపి రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాములు, భాస్కర్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, తపస్ కార్యకర్తలందరూ పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ పార్టీ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించినభారత జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో భువనగిరి మండల పార్టీ అధ్యక్షుడు జనగాం పాండు ముద్రించిన క్యాలెండర్ ను భారత జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గారి చేతుల మీదుగా మరియు భువనగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి,బిఆర్ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా బిఆర్ఎస్ పార్టీ క్యాలెండర్ ఆవిష్కరించారు, ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ భువనగిరి మండల పార్టీ అధ్యక్షుడు జనగాం పాండు, కొలుపుల అమరేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, టౌన్ అధ్యక్షులు కిరణ్ కుమార్, జిల్లా యువజన నాయకులు రచ్చ శ్రీనివాస్ రెడ్డి, రాసాల మల్లేష్, పుట్ట వీరేష్ యాదవ్, సిలివేరు మధు, మూల నాగేంద్రబాబు, సూరజ్, జనగా మహేష్, %దీ=ా% అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు



## అనారోగ్యంతో మృతి చెందిన నిరుపేద చేనేత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన, చేనేత కార్మికుడు రాపోలు సత్తయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఈ విషయం తెలుసుకున్న స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్ ఆ నిరుపేద చేనేత కుటుంబానికి అండగా ఉండాలని ఉద్దేశంతో తక్షణ సహాయం కింద స్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించాలని తెలిపారు, బిఆర్ఎస్ నాయకులు రాపోలు సత్తయ్య నివాసానికి వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించి, పూర్తి ఫౌండేషన్ అందించిన, 5000/వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు, ఈ కార్యక్రమంలో ఉప్పల ఆంజనేయులు, బాకారం నాగరాజు, రాపర్తి కరుణాకర్, బొమ్మ గోని రమేష్ గౌడ్, పేరా రమేష్, చెరుపల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు

## కొత్తగా పట్టాదారు పాస్ బుక్ వచ్చిన రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలి : ఎడిఎ దేవ్ సింగ్



మిర్యాలగూడ , జనవరి 22:- (వార్తమిర్రర్) : రైతు భరోసా పథకం కింద 31 డిసెంబర్ 2024 వరకు కొత్తగా వచ్చిన పట్టాదారు పాస్ పుస్తకం గల రైతులు, ఇదివరకు పాస్ పుస్తకంతో వచ్చి రైతు భరోసా (రైతుబంధు) పథకం కింద దరఖాస్తు పెట్టుకోని రైతులు అందరూ దరఖాస్తు చేసుకోవాలని స్థానిక వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.దేవ్ సింగ్ కోరారు. బుధవారం విలేఖరులతో మాట్లాడుతూ పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జీరాక్స్, బ్యాంక్ ఎకౌంటు సేవింగ్ ఖాతా ఈ కేవైసీ అయిన జిరాక్స్, దరఖాస్తు ఫారం నింపి వ్యవసాయ శాఖ కార్యాలయంలో లేదా గ్రామాలకు సంబంధించిన వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత వచ్చి ఇవ్వాలని కోరారు. దరఖాస్తు చేసుకోవడానికి చివరి ఈ నెల 26వరకు అవకాశం ఉన్నదన్నారు. రైతు భరోసా పథకం కింద అకౌంట్ నెంబర్ మార్పులు లేదా వేరే కారణాలతో ఎకౌంట్ నెంబర్లు మార్చాలనుకునే రైతులు ఈ నెల 24లోగా దరఖాస్తు నింపి వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు ఫారం మీద రాసి ఇవ్వాలన్నారు. ఇదివరకు వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు ఇచ్చినవాళ్లు మళ్లీ ఇవ్వవలసిన అవసరం లేదన్నారు.

# విద్యాదానం అన్నింటికన్నా మిన్న: డీఈవో సత్యనారాయణ

## విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది విద్య ఒక్కటే రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ తుపాకుల రవి



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : సంస్థాన్ నారాయణపురం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం పొట్లాలు అందజేస్తున్న డీఈవో సత్యనారాయణ, రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి.సంస్థాన్ నారాయణపురం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు పంపిణీ చేసేందుకు అల్పాహారం ప్యాకెట్లను ప్రధానోపాధ్యాయులకు, విద్యార్థులకు అందజేస్తున్న డీఈఓ సత్యనారాయణ, రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ తుపాకుల రవి గ్రామీణ ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులు ఆకలితో ఉండకూడదని దాతలు అందిస్తున్న సహకారం ఎంతో గొప్పదని యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాధికారి కే. సత్యనారాయణ అన్నారు. సంస్థాన్ నారాయణపురం మండలంలోని 7 ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదవ తరగతి విద్యార్థులకు రూ.1.50 లక్షల విలువైన బిస్కెట్లు, అల్పాహారం, పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందించిన హైదరాబాదుకు చెందిన రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి ని అభినందించి సన్మానించారు. సంస్థాన్ నారాయణపురం లోని జెడ్పి ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో దాతతో కలిసి, ఆయన చేతుల మీదుగా జడ్పి, మోడల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు విద్యార్థులకు వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఈఓ మాట్లాడుతూ, అన్నింటికీ మూలం చదువేనని, పట్టుదలతో చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థానానికి ఎదగాలని ఉద్బోధించారు. ట్రస్ట్ సమకూర్చిన 50 రోజుల అల్పాహారం సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. సాహితీవేత్త బడుగు శ్రీరాములు మాట్లాడుతూ, గ్రామాలు, విద్యార్థులు అభివృద్ధి చెందేందుకు గురువులు కృషి చేయాలని కోరారు. ఉత్తమ ఫలితాలు సాధించి గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు

### నేను హాస్టల్లో ఉండి చదువుకున్న: తుపాకుల రవి, రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ

తాను ప్రభుత్వం ఏర్పాటు చేసిన నవోదయ విద్యాలయంలో చదువుకున్నానని, తాను సంపాదించిన దాంట్లో కొంత అనాథలకు పేదలకు విద్యాభివృద్ధికి అందజేస్తున్నానని రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి తెలిపారు. పేదరికాన్ని రూపుమాపేది, విద్యార్థుల తలరాతను మార్చేది, బాలల భవిష్యత్తును తీర్చిదిద్దేది చదివేనని వివరించారు. చదువు విలువ తెలుసుకోవాలని, ఎప్పుడూ ఉన్నత స్థానం కోసం పోటీపడాలని సూచించారు. తాను తన మిత్రులు ఏర్పాటు చేసిన ఈ ట్రస్టు ద్వారా అనాథలకు, నిరుపేదలకు, విద్యార్థులకు, పాఠశాలకు అవసరమైన సహకారాన్ని అందిస్తున్నామని చెప్పారు. సంపాదనలో కొంత భాగాన్ని సేవా కార్యక్రమాలకు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ వంతు సేవ చేయాలని కోరారు. కార్యక్రమానికి మండల విద్యాధికారి గోలి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. సామాజిక కార్యకర్త సుక్కా సుదర్శన్, జడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రమాదేవి (సంస్థాన్ నారాయణపురం బాలురు), ఉషారాణి సమస్తాన్ నారాయణపురం బాలికలు), హనుమంతు (పుట్టపాక), కే. ఉదయ (జనగాం), నర్రా నరసింహారెడ్డి (గుజ్జ), మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు దీపా జోషి తదితరులు పాల్గొన్నారు.



## శ్రీసాయిదత్తాశ్రమంలో ఘనంగా అనగాష్టమి వ్రతములు

మిర్యాలగూడ , జనవరి 22 :-( వార్త మిర్రర్) మిర్యాలగూడ పట్టణం రైల్వే కాలనీ శ్రీ సాయి దత్త ఆశ్రమంలో బుధవారం అనగాష్టమి వ్రతంలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున దత్తాత్రేయ అభిషేకంలో అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అనగాష్ట వ్రతంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు గుండా శ్రీనివాస్ ఉపాధ్యక్షుడు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి నరేందర్. కోశాధికారి మట్టయ్య, జానకిరాముడు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు